క్లుప్తంగా

విద్యార్థులకు పుస్తకాలు అందజేత



గుంటూరు మెడికల్: కార్పొరేట్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు ఉచితంగా విద్యనభ్యసించేందుకు స్వచ్ఛంద సంస్థలు చేస్తున్న కృషి అభినందనీయమని గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ అన్నారు. చైత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం ఆసుపత్రి సూపరింటెండెంట్ చాంబరులో విద్యార్థులకు రూ.10 వేలు విలువ చేసే పుస్తకాల కిట్లను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ చైత్ర ట్రస్ట్ అధినేత రవికుమార్ ప్రత్యేక చొరవ తీసుకుని విద్యార్థులను కార్పొరేట్ స్కూల్లో చేర్పించేందుకు ప్రత్యేక శ్రద్ధ కనబర్చారన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యకు ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నాయన్నారు. కార్యక్రమంలో చైత్ర ట్రస్ట్ అధ్యక్షుడు కె.రవికుమార్, స్టాఫ్ నర్సు హేమలత పాల్గొన్నారు.

కుటుంబ కలహాలు, అప్పుల బాధతో ఆత్మహత్య



పట్నంబజారు: కుటుంబ కలహాలు, అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై కేసు నమోదైంది. లాలా పేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోనేరు సెంటర్ సమీపంలో నివాసముంటున్న రాసా శివయ్య (40) చికెన్ దుకాణం నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆయనకు భార్య సాంబ్రాజ్యం, ఇద్దరు సంతానం ఉన్నారు. గతంలో భార్యతో వివాదం కావడంతో ఇద్దరూ కొంతకాలం పాటు వేరుగా ఉన్నారు. రెండేళ్ల నుంచి తిరిగి కలిసి ఉంటున్నారు. కుటుంబ కలహాలు, కొద్ది పాటి అప్పులు ఉన్న నేపథ్యంలో.. శనివారం కుటుంబ సభ్యులు విజయవాడ కనక దుర్గమ్మ గుడికి వెళ్లిన క్రమంలో శివయ్య ఇంటిలో ఫ్యానుకు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వీరాంజనేయునికి విశేషాలంకరణ



పొన్నూరు: పట్టణంలోని శ్రీ సహస్ర లింగేశ్వరస్వామి, వీరాంజనేయ స్వామి దేవస్థానంలో శనివారం ఆలయ ఈవో టి. శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు స్వామివారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇటీవల హనుమజ్జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని ప్రకాశం జిల్లా పొదిలికి చెందిన విశ్రాంత ఆర్టీసీ డ్రైవర్ తెల్లమేకల హనుమంతరావు స్వామికి మొక్కుబడిగా రూ.30 వేల వ్యయంతో ఎర్ర గులాబీలతో గజమాల సమర్పించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

మహిళ ఆత్మహత్య

గుంటూరు ఈస్ట్: మహిళ ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కృష్ణబాబు కాలనీలోని కొవ్వూరు భవానీ (30)తో చంద్రశేఖర్‌కు 13 సంవత్సరాల క్రితం వివాహమైంది. వారికి ఇద్దరు సంతానం. కుటుంబ కలహాల నేపథ్యంలో భవానీ శనివారం ఇంట్లో ఉరి వేసుకుని మృతిచెందింది. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తిపై దాడి

గుంటూరు ఈస్ట్: వ్యక్తిపై గుర్తు తెలియని ముగ్గురు దాడిచేసి గాయపరిచిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శ్రీనివాసరావుపేటకు చెందిన సాయి ఖాశింను శనివారం తెల్లవారుజామున గుర్తుతెలియని ముగ్గురు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి కర్రలతో దాడి చేశారు. అనంతరం పరారయ్యారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎడ తెరపిలేని వర్షం



నీట మునిగిన పొలాన్ని చూపుతున్న వ్యవసాయాధికారి



చిరుజల్లులు

తెనాలిఅర్బన్: శుక్రవారం రాత్రి నుంచి ఎడ తెరపి లేని వర్షం కురుస్తోంది. శనివారం ఉదయం నుంచి చిరుజల్లులు పడుతున్నాయి. రాత్రి కురిసిన వర్షానికి పట్టణంలోని పలురోడ్లు జలమయమయ్యాయి. కొద్ది గంటలకే వర్షపు నీరు మురుగు కాల్వల నుంచి బయటకు వెళ్ళాయి. ఉదయం నుంచి చల్లగా ఉండటంతో ప్రజలు కొంత సేదతీరారు.

123.4 మి.మీ. వర్షపాతం

తెనాలిరూరల్: తెనాలి పట్టణం, మండలంలో 123.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. శుక్రవారం ఉదయం ఎనిమిది నుంచి శనివారం ఉదయం ఎనిమిది గంటల వరకు ఈ వర్షపాతం నమోదైంది. శుక్రవారం రాత్రి పొద్దుపోయాక అతి భారీ వర్షం కురవడంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. సుమారు రాత్రి 10.45కు ప్రారంభమైన వర్షం తెల్లవారులు పడుతూనే ఉంది. భారీ వర్షం కారణంగా పొలాలు నీట మునిగాయి. మునిగిన పొలాలను వ్యవసాయాధికారులు శనివారం పరిశీలించారు. నారుమళ్లు వేసిన పొలాలకు ఇబ్బంది లేదని, వెద పద్ధతిలో సాగు ప్రారంభించిన రైతులకు నష్టం కలిగే అవకాశం ఉందని మండల వ్యవసాయాధికారి జి.ప్రేమ్‌సాగర్ తెలిపారు. పొలాల్లో నిలచిన నీరును రైతులు బయటకు పంపే ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. నీరు వెళ్లినా వెద పద్ధతిలో సాగు చేసిన విత్తనాలు మొలకెత్తకపోతే తిరిగి చల్లుకోవాలని సూచించారు. పల్లంలో ఉన్న రైతులు నీటిని బయటకు పంపే ప్రత్యామ్నాయ మార్గాలను త్వరితగతిన చేపట్టాలన్నారు.

సీఎం చిత్రపటం ఆవిష్కరణ



చంద్రబాబు చిత్రపటాన్ని ఆవిష్కరిస్తున్న ఆలపాటి తదితరులు

తెనాలి: పట్టణంలోని ది కాకతీయ కో-ఆపరేటివ్ సొసైటీలో ఏర్పాటు చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్రపటాన్ని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ శనివారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ 23 ఏళ్ల క్రితం స్థాపించిన ది కాకతీయ కో-ఆపరేటివ్ సొసైటీ ప్రజల సహకారంతో దినదినాభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ప్రభుత్వ సహకారం ఎంతగానో అవసరం ఉందని చెప్పారు. సొసైటీ చైర్మన్ దావులూరి లక్ష్మీకాంతారావు, డైరెక్టర్ షేక్ ఖలీల్, ఇతర డైరెక్టర్లు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు తాడిబోయిన హరిప్రసాద్ పాల్గొన్నారు.

కార్మెల్‌మాత పండుగకు ఏర్పాట్లు పూర్తి



చర్చి ఆవరణలో ఏర్పాటు చేసిన రంగుల రాట్నాలు



బొమ్మల దుకాణాలు

ఫిరంగిపురం: కార్మెల్ మాత పండుగకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు బాల ఏసుదేవాలయ విచారణ గురువులు ఎం.ఫాతిమా మర్రెడ్డి శనివారం తెలిపారు. పండుగ సందర్భంగా అనేక ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు అవసరమైన గదులు, స్నానం కోసం ట్యాప్‌లు, తాగునీటి వసతి, భోజన సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. పండుగ సందర్భంగా కొండ మెట్ల బజారు, చర్చి ప్రాంగణం, రాజాపేట ప్రాంతాల్లో బొమ్మల అంగళ్లు, తినుబండారాల దుకాణాలు, ఐస్ క్రీం బండ్లు, పలురకాల రంగుల రాటాన్లు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కొండ కింది భాగం నుంచి కార్మెల్ మాత మందిరం వరకు రంగురంగుల విద్యుత్ దీపాలు అమర్చారు.

నిర్లక్ష్యం నీడలో.. పచ్చదనం కనుమరుగు

- పొన్నూరులో పచ్చదనం పరిరక్షణలో అధికారుల తాత్సారం
- పట్టణంలో నాటిన మొక్కలు కనుమరుగు
- మరికొన్ని చోట్ల మొక్కలకు నీరందక ఎండిన వైనం



నిడుబ్రోలు బ్రిడ్జి వద్ద మొక్కలు ఎండిపోయి వృథాగా పడిఉన్న కుండీలు

పొన్నూరు: పచ్చదనంతో పాటు నిలువ నీడకోసం వర్షాకాలంలో చెట్లు నాటి వాటిని పరిరక్షిస్తుంటారు. పట్టణాల్లో చెట్ల పరిరక్షణకు ప్రత్యేక కార్యచరణ రూపొందించుకొని దానికి అనుగుణంగా సంబంధిత అధికార గణం ముందుకు సాగుతుంటారు. దీంతో కాస్తో కూస్తో పచ్చదనం అక్కడక్కడ మనకు కనిపిస్తుంటుంది. కానీ పొన్నూరులో పచ్చదనం పెంపుదల విషయంలో మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం వహించడంతో లక్ష్యం కాస్త నీరు గారిపోయింది. గతంలో పట్టణాభివృద్ధిలో భాగంగా నిడుబ్రోలు బ్రిడ్జితో పాటు పలు ప్రాంతాల్లో సిమెంటు కుండీలు ఏర్పాటు చేసి మొక్కలు నాటారు. వాటిని పరిరక్షించడంలో యంత్రాంగం విఫలమవడంతో ప్రజాధనం వృధా కావడమే తప్ప ఫలితం లభించ లేదు.

నిలిచేందుకు నీడలేని దుస్థితి

రోడ్డు విస్తరణలో భాగంగా అక్కడక్కడ ఉన్న చెట్లను నరికివేయడంతో ఉన్న పచ్చదనం కాస్త ఆవిరైంది. పట్టణంలో పచ్చదనాన్ని పరిరక్షించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. ప్రధాన కూడళ్లలో చెట్లు లేకపోవడంతో వివిధ పనుల నిమిత్తం పట్టణానికి వచ్చే గ్రామీణ ప్రాంత ప్రజలకు నిలువ నీడ లేకుండా పోతుంది. ప్రతిరోజు మున్సిపల్ ట్యాంకర్ ద్వారా మొక్కలకు నీరు అందించి సంరక్షించేందుకు ప్రణాళికలు రూపొందించారు. దీన్ని ఆచరణలో అమలు చేయకపోవడంతో పొన్నూరులో పచ్చదనం దాదాపుగా కనుమరుగైపోయింది. అరకొరగా పట్టణంలోని నిడుబ్రోలు బ్రిడ్జిపై కుండీలను ఏర్పాటు చేసి వాటిలో మొక్కలు నాటారు. వాటికి సక్రమంగా నీరు అందించక పోవడంతో కొన్ని పూర్తిగా ఎండిపోయాయి. మరికొన్ని ఆవులు తిని పాడై పోయాయి. ఇప్పటికైనా అధికారులు చొరవ చూపి ఈ వర్షాకాలంలో మొక్కలు నాటి పచ్చదనాన్ని కాపాడాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

జ్వరంతో చికిత్స పొందుతున్న గర్భిణి మృతి



మృతురాలు మైలా నిరీషా

పెదకాకాని: జ్వరంతో చికిత్స పొందుతున్న గర్భిణి మృతి చెందిన ఘటన పెదకాకానిలో చోటు చేసుకుంది. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే 9 నెలల గర్భిణి మృతి చెందిందని కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగడంతో వివాదం చోటు చేసుకుంది. మంగళగిరి రూరల్ మండలం ఎర్రబాలెంకు చెందిన మైలా గోపీకృష్ణకు రత్నాలచెరువుకు చెందిన నిరీషాతో 2019లో వివాహం జరిగింది. వారికి 16 నెలల పాప గుణదీక్షిత సంతానం. నిరీషా తొలి కాన్పు పెదకాకాని గ్రామంలోని శ్రీహనుమత్ కాశీ వరప్రసాద బాబూజీ ట్రస్టు ఆస్పత్రిలో చేయించుకుంది. ప్రస్తుతం ఆమె తొమ్మిది నెలల గర్భిణి.

జ్వరంతో ఇబ్బంది పడుతున్న ఆమెను కుటుంబ సభ్యులు ఈ నెల 10న కాశీ వనాశ్రమం ఆసుపత్రిలోనే చేర్పించారు. చికిత్స పొందుతున్న మైలా నిరీషా(26) పరిస్థితి విషమించి శనివారం తెల్లవారు జామున మరణించింది. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే నిరీషా మృతి చెందిందని కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగడంతో ఆసుపత్రి వద్ద ఉద్రిక్తత చోటు చేసుకుంది. స్థానికుల ఫిర్యాదు మేరకు సంఘటన స్థలానికి చేరుకున్న సీఐ కె.వీరాస్వామి, సిబ్బంది విచారణ చేపట్టారు. కొద్దిసేపటి తరువాత ఆసుపత్రి నిర్వాహకులు, మృతురాలి బంధువులకు మధ్య జరిగిన చర్చలు సఫలం కావడంతో మృతదేహాన్ని ఆసుపత్రి అంబులెన్స్‌లో యర్రబాలెం తరలించారు.

కులం పేరుతో దూషించిన వారిని శిక్షించాలి

నెహ్రూనగర్: కులం పేరుతో దూషించిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని స్వర్ణాంధ్ర ఎమ్మార్పీఎస్ నగర అధ్యక్షుడు సుబ్బయ్య డిమాండ్ చేశారు. నగరంలోని సంఘ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్వర్ణాంధ్ర వ్యవస్థాపక అధ్యక్షుడు ఏసుబాబును కొందరు వ్యక్తులు ఫోన్‌లో కులం పేరుతో దూషిస్తూ, పరుష వ్యాఖ్యలు చేసి మానసికంగా ఇబ్బందులకు గురి చేశారని తెలిపారు. దీనిపై పాత గుంటూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు చెప్పారు. కానీ ఇంత వరకు వారిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని.. తమను ఏమీ చేయలేవు అంటూ బెదిరింపులకు దిగారంటూ ఆరోపించారు. అధికారులు స్పందించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని... లేని పక్షంలో నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

నగరంలో భారీ వర్షం

నెహ్రూ నగర్: గుంటూరు నగరంలో శుక్రవారం అర్ధరాత్రి కుండపోత వర్షం కురిసింది. నగరంలోని పలు దిగువ ప్రాంతాలు జలమయం అయ్యాయి. ముఖ్యంగా డొంక రోడ్డు, అరండల్‌పేట, పాత గుంటూరు, కొరిటెపాడు తదితర ప్రాంతాల్లోని నీరు నిలిచింది. నగరపాలక సంస్థ కార్యాలయం వెనుక ఉన్న చేపల మార్కెట్ సెల్లార్ మునిగిపోవడంతో వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించిన పులిపాక విద్యార్థులు

గుంటూరు ఎడ్యుకేషన్: పాత గుంటూరులోని శ్రీ మహాకవి తిక్కన-పులిపాక ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థులు నూజివీడులోని ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బీవీ రమణయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలా పృథ్వి మనోజ్ కుమార్ 579 మార్కులతో గుంటూరు నగరంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ప్రథమ స్థానంలో నిలువగా, 566 మార్కులు సాధించిన షేక్ బీబీ ఆయేషా ద్వితీయ స్థానంలో నిలిచినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వృద్ధుడి మృతి

చేబ్రోలు: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి వైద్యశాలలో చికిత్స పొందుతున్న వృద్ధుడు శనివారం మరణించాడు. పల్నాడు జిల్లా అమరావతి మండలం నరుకుళ్లపాడు గ్రామానికి చెందిన చింకా కోటేశ్వరరావు (59) చేబ్రోలు మండలం మంచాల గ్రామంలోని బంధువుల ఇంటికి వెళ్లటానికి ద్విచక్ర వాహనంపై ఈ నెల 7న బయలు దేరాడు. మార్గ మధ్యంలో చేబ్రోలు శివారు శ్రీమంత్ స్థూపం సమీపంలో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే ప్రయత్నంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పి ప్రమాదానికి గురైంది. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడిన కోటేశ్వరరావు గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. చేబ్రోలు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అందజేశారు.

'లైంగిక దాడి నిందితులకు కఠినంగా శిక్షించాలి'

మంగళగిరి: ముచ్చుమర్రిలో బీసీ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేశన శంకరరావు డిమాండ్ చేశారు. పట్టణంలోని జాతీయ రహదారి వెంట ఉన్న కార్యాలయంలో శంకరరావు మాట్లాడుతూ.. రాష్ట్ర చరిత్రలో 9 సంవత్సరాల బాలికపై లైంగిక దాడికి పాల్పడి హత్య చేయడం ప్రభుత్వానికి మాయని మచ్చగా మారిందన్నారు. పార్కులో ఆడుకుంటున్న బాలికను అపహరించి ఇంతటి దారుణానికి పాల్పడటం, మృతదేహాన్ని కనపడకుండా చేయడం దారుణమన్నారు. ఈ ఘోరానికి పాల్పడిన వారిని వెంటనే కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని హెచ్చరించారు. ఇప్పటికీ ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోకపోవడం తగదన్నారు. హోంమంత్రి మహిళ అయినా చర్యలు చేపట్టకపోవడం బాధాకరమని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళల రక్షణకు ప్రాధాన్యమిస్తున్నట్లు చెబుతున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దీనిపై ఎందుకు స్పందించ లేదని నిలదీశారు.

భక్తి శ్రద్ధలతో మొహర్రం



అలంకరణలో పీర్లు

పొన్నూరు: మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే మొహరంను మొల్లా ముజావర్ల కమిటీ ఆధ్వర్యంలో అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. హాజరత్ మొహమ్మద్ వారి మనుమలు హాజరత్ ఇమామే హసన్, హాజరత్ ఇమామే హుస్సేన్ వారి త్యాగాలను స్మరిస్తూ నిర్వహిస్తున్న వేడుకలలో భాగంగా ఏడో రోజు శనివారం పీర్ల చావిడిలో హాజరత్ అలీ జెండా ఆవిష్కరించారు. ఈ నెల 15న 9వ రోజు పీర్ల గుండంలో నడవటం జరుగుతుందని మొల్లా ముజావర్ల కమిటీ తెలిపారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొనాలని కోరారు. మొల్లా కరీమ్, మొల్లా హైదర్, మొల్లా గబ్బర్ బాషా, మొల్లా సంధాని,మొల్లా నజీర్, షేక్ , ఖాదర్, షేక్ మునవార్, మొల్లా నాజుముద్దీన్, మొల్లా ఖాలీల్ బాషా, మొల్లా బాజి, షేక్.గౌస్, మొల్లా అఫ్రీద్, మొల్లా అర్షద్, మొల్లా జలీల్, మొల్లా ఇమ్రాన్, షేక్ రఫీ, షేక్ అమీన్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌టీఆర్ ప్రతిభా పురస్కారాలు ప్రదానం



ప్రతిభా పురస్కారాలు అందుకున్న వారితో నిర్వాహకులు

నగరంపాలెం: గుంటూరు మార్కెట్ సెంటర్‌లోని శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో కళా దర్బార్ (అమరావతి) ఆధ్వర్యంలో ఎన్.టి.ఆర్ 101వ జయంతి వేడుకల్లో భాగంగా శనివారం రాత్రి ఎన్డీఏ కూటమి ప్రజా ప్రతినిధులకు ఎన్టీఆర్ ప్రతిభా పురస్కారాల ప్రధానోత్సవం నిర్వహించారు. తొలుత ఎన్టీఆర్ చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వలన చేసి, నివాళులర్పించారు. అనంతరం సంగీత విభావరిలో ఎన్టీఆర్ చిత్రాల్లోని గీతాలను గాయకులు శైలజ, సౌజన్య, పావని, రసూల్‌బాబు, సుధీర్‌బాబు, హరికిషన్, లెజెండ్ గాయకుడు ప్రవీణ్ కుమార్ ఆలపించారు. కళా దర్బార్ వ్యవస్థాపక అధ్యక్షుడు పొత్తూరి రంగరావు మాట్లాడుతూ తెలుగు తేజ స్ఫూర్తి ప్రదాత, సినీ రంగంలో రారాజుగా వెలు గొందిన తెలుగుజాతి ఆరాధ్య దైవం ఎన్టీఆర్ అన్నారు. జాతి ఘనతను, కీర్తిని ప్రపంచ నలు మూలలకు చాటి చెప్పిన కారణజన్ముడని కొనియాడారు. అనంతరం ఎమ్మెల్యేలు గల్లా మాధవి (గుంటూరు పశ్చిమ), నసీర్ అహ్మద్(గుంటూరు తూర్పు), డాక్టర్ చదలవాడ అరవిందబాబు (నరసరావుపేట) ఎన్టీఆర్ ప్రతిభా పురస్కారాలను అందజేశారు. ఆత్మీయ అతిథులుగా విచ్చేసిన టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు టీడీ జనార్దన్, టీడీపీ అధికార ప్రతినిధి రామకృష్ణప్రసాద్, ప్రముఖ నిర్మాత ఆర్.వెంకటేశ్వరరావు, ముప్ప హోమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ అధినేత ముప్పా వెంకయ్యచౌదరి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో పి.కల్పన, మేకల రవీంద్రబాబు, గుమ్మడి గోపాలకృష్ణ పాల్గొనగా, వ్యాఖ్యాతగా ప్రాసమణి, కుమార్ వ్యవహరించారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య



మనోజ్‌కుమార్‌రెడ్డి మృతదేహం

గుంటూరు రూరల్: అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శనివారం నల్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ ప్రవీణ్ తెలిపిన వివరాలు.. నగరాలు మునుస్వామినగర్ రెండవ లైనుకు చెందిన తల్లపురెడ్డి మనోజ్‌కుమార్‌రెడ్డి(30) నగరంలో కొరియర్ బాయ్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం కొరియర్ పనికి వెళ్లి రాత్రి 10 గంటలకు తిరిగి వచ్చి ఇంట్లో తన గదిలో నిద్రకు ఉపక్రమించాడు. తెల్లవారినా నిద్రలేవకపోవటంతో కుటుంబసభ్యులు గదిలోకి వెళ్లి చూడగా ఫ్యాన్‌కి లుంగితో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు గుర్తించారు. దీంతో మృతదేహాన్ని దించి పోలీసులకు సమాచారం అందించారు. ఆత్మహత్యకు గల కారణం అప్పుల బాధ లేనని బంధువులు తెలిపారని పోలీసులు చెప్పారు. మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించి పోస్ట్ మార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. మృతుడి తండ్రి శ్రీనివాస రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

విద్యతోనే ఉన్నత స్థానం



అవార్డులు అందుకున్న వారితో కృపాచారి, స్వర్ణలతాదేవి

ఫిరంగిపురం: బడుగు, బలహీన వర్గాల వారు చదువు ద్వారానే ఉన్నతస్థానం సాధించవచ్చని వెడ్స్ సంస్థ డైరెక్టర్ డాక్టర్ స్వర్ణలతాదేవి అన్నారు. మండల కేంద్రంలోని దీనాపూర్ కళాశాల ఆవరణలో కార్డ్స్ సంస్థ వ్యవస్థాపకుడు రంజన్‌బాబు జయంతి, అంబేడ్కర్ దళిత ఓపెన్ యూనివర్సిటీ స్నాతకోత్సవం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో ప్రతిభ చూపిన వారికి ఓపెన్ యూనివర్సిటీ తరపున జాతీయ అవార్డులు అందజేశారు. వర్సిటీ వైస్ చాన్సలర్ కృపాచారి మాట్లాడుతూ పేదలు అభివృద్ధి పథంలో పయనిస్తేనే దేశం సుభిక్షంగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమానికి ముందుగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. రంజన్‌బాబు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్డ్స్ సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు అగ్నిప్రమాద బాధిత రైతుల సమావేశం

తాడేపల్లి రూరల్: శుభం కోల్డ్ స్టోరేజ్‌లో పంటను భద్రపరచుకుని నష్టపోయిన బాధిత రైతుల సమావేశం సోమవారం నిర్వహించనున్నట్లు అగ్ని ప్రమాద బాధితుల సంఘం శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. గుంటూరు జిల్లా, దుగ్గిరాలలో జనవరి 19వ తేదీన శుభం కోల్డ్ స్టోరేజ్‌లో పసుపు పంటను భద్రపరచుకుని అగ్నిప్రమాదంలో నష్టపోయిన రైతులు హాజరుకావాలని కోరింది. సోమవారం ఉదయం 10 గంటలకు పసుపు వర్తకుల సంఘం హాల్‌లో సమావేశం నిర్వహిస్తున్నామని వెల్లడించింది.

నవగ్రహ దేవతలకు విశేష పూజలు

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని కాళహస్తీశ్వర స్వామి ఆలయంలోని నవగ్రహ దేవతా విగ్రహాలకు శనివారం విశేష పూజలు నిర్వహించారు. అర్చకులు ఆంజనేయశర్మ ఉదయాన్నే నవగ్రహ దేవతామూర్తులకు పంచామృతాలతో అభిషేకాలు చేశారు. ఆయా దేవతా అష్టోత్తర శతనామాలతో విశేష పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

రుణాల పేరిట మహిళ మోసం

మంగళగిరి : పట్టణంలోని టిడ్కో నివాసాలలో ఉంటున్న మహిళలను రుణాల పేరిట మోసం చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. టిడ్కో నివాసాలలో ఉంటున్న వారికి బ్యాంకు రుణాలు ఇప్పిస్తామంటూ నమ్మబలికిన గుంటూరుకు చెందిన మహిళ మాట నమ్మి సుమారు 80 మంది రూ.3 వేల చొప్పున నగదు చెల్లించారు. వారికి ఎలాంటి రసీదులు ఇవ్వలేదు. రుణాలు మంజూరు కాకపోవడంతో బాధిత మహిళలు మోసపోయామని గ్రహించి శనివారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రకటన

[illegible]